# రేపటి మునుపు

నా నలభయ్యో ఏట నా భార్య చనిపోయింది. నాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయి ఇంటర్. చిన్నమ్మాయి పదోతరగతి చదువుకుంటూ ఉండేవారు. నా దగ్గర బంధువులు, మిత్రులు నన్ను మళ్ళీపెళ్ళి చేసుకోమని సలహాలు ఇచ్చినా చేసుకోవాలనిపించలేదు.

పిల్లలకు మంచిగా చదువులు చెప్పించి, మంచి సంబంధాలుచూసి, పెళ్ళిళ్ళు చేసి నా బాధ్యతలు పూర్తిచేసుకునే సరికి యాభయి అయిదులో పడ్డాను. ఇంకో అయిదేళ్ళ సర్వీసు ఉంది. పిల్లలు కాపరాలకు దూరంగా వెళ్ళిపోయాక ఒంటరిననే భావం కలిగి, ఎక్కువవడం మొదలెట్టింది. ఆఫీసులో ఉంటే ఏదో విధంగా సమయం గడిచిపోతుంది. ఇంట్లోనే ఇబ్బందిగా ఉండడం మొదలెట్టింది. నాలుగు మాటలు చెప్పడానికి కాని, వినడానికి కాని ఎవరూ ఉండకపోవడం కష్టం కాసాగింది. ఓపిక ఉంటే ఇంట్లోనే భోజనం తయారు చేసుకుని తినేవాడిని. లేకుంటే ఏ హోటలుకో వెళ్ళి తినేవాడిని. ఏకాకి జీవితం విసుగు కలిగించడం మొదలుపెట్టింది.

ఆ మధ్య సదానందం నా దగ్గరకు వచ్చినప్పుడు అన్నాడు, "అన్నా, ఇప్పటికయినా మించి పోయిందేమీ ఏదు. ఇదో ఈ చేతులతో నీకన్నా పెద్ద వాళ్ళకు పెళ్ళిళ్ళు చేశాను. వెనకా ముందూ ఆడకు. నీకో తోడు ఉండాలి. లేకపోత తర్వాత్తర్వాత ఇంకా బాధపడతావు. వరంగల్‌లో నాకు తెలిసినామె, సరస్వతి అని ఉంది. బి.ఇడి. పూర్తయి ప్రయివేటు స్కూల్లో టీచరుగా ఉద్యోగం చేస్తోంది. నలభయి అయిదు సంవత్సరాలుంటాయి. భర్తనుండి విడాకులు తీసుకుందనుకుంటాను, బావుంటుంది. నీ గురించి ఆమెతో మాట్లాడమంటే మాట్లాడతాను."

"పిల్లలా?" అడిగాను.

"ఒక కొడుకు ఉన్నాడు. ఇంటరు పూర్తి చేసి డిగ్రీలో చేరినట్టుంది."

ఏ మూడ్‌లో ఉన్నానో, ఏమో, "సరే మాట్లాడు" అన్నాను. అదే నేను చేసిన పొరపాటు.

"సరస్వతి ఫోను నెంబరు నాకు తెలియదు. ఈ సారి వరంగల్ వెళ్ళినప్పుడు ఆమెతో మాట్లాడి ఆమెకూ ఇష్టమయితే ఆమెకు నీ ఫోను నెంబర్లిస్తాను. సరేనా?"

బి.సి.కరుణాకర్

"వయసులో పదేళ్ళ తేడా ఉంది కదరా?"

"ఆమెకు నీ వయసు తదితర వివరాలన్నీ చెబుతాను. తన ఫోను నెంబరు ఇచ్చిందనుకో తనకా తేడా, అభ్యంతరం లేదన్నట్టే కదా. అన్నా, ఈ వయసులో కూడా నువ్వు బావుంటావే. చూస్తే కాదంటుందా ఏమిటి? ఈ విషయాల్లో మధ్యవర్తులు లేకుండా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మంచిగా ఉంటుందన్నా".

తలూపాను. సదానందం బారిన ఇష్టంగానే పడుతున్నట్టు అనిపించింది. అతనొక టెలికమ్యూనికేషన్ సంస్థలో పనిచేస్తున్నాడు. నలభయి రెండు సంవత్సరాలుంటాయి. విజయవాడలో ఒక భార్య, నరసరావుపేటలో మరో భార్య ఉందని తెలిశాక, 'అదేమిట్రా?' అని అడిగితే, 'అదేం కాదన్నా, అంత అదృష్టమా నాకు? ఒక్క భార్యతో వేగడమే కష్టమన్నా. భార్యలేదు కాబట్టి నీకేం తెలియదు' అని మాట మీంచి దూకేశాడు. అతని మాటలు నిజం అయినా అతను చెబుతున్నప్పుడు నిజంలా అనిపించదు. నమ్మబలుకుతుంటాడు. వాళ్ళిద్దరినీ తప్పించుకోడానికో, ఏమో విశాఖనుండి హుబ్లీ వరకు డ్యూటీల మీద డ్యూటీలు వేయించుకుని తిరుగుతుంటాడు. పనిలో పనిగా పెళ్ళి సంబంధాలు చూసి పెడుతుంటాడు. ఇళ్ళ ప్లాటులు అమ్మి పెడుతుంటాడు.

"ముందొక మాట చెప్పు. ఈ వయసులో నువ్వు పెళ్ళి చేసుకోడానికి నీ పిల్లలకు ఏ అభ్యంతరం ఉండదు కదా?" అడిగాడు.

"ఏదయినా కుదిరితే వాళ్ళకు చెప్పే పద్ధతిలో చెబుతాను. నా మాట కాదనరు" అన్నాను.

వారం తర్వాత సరస్వతి నుండి ఫోను వచ్చింది. నా వయసు తెలిశాక ఆమె ఫోను చేస్తుందని అనుకోలేదు. ఏ కథలు చెప్పాడో, ఏమో!

"మీ గురించి మీ తమ్ముడు చాలా భాగా చెప్పాడండీ. అతనితో మీరు వరంగల్ వచ్చి ఉంటే బావుండేది. మీరు నన్ను చూసి ఉండేవాళ్ళు. మేము మిమ్మల్ని చూసినట్టు ఉండేది... "కలుపుగోలు వ్యక్తిలా అనిపించింది.

నాకు ఆడవాళ్ళతో మాట్లాడడం చాతకాదు, బిడియపడుతుంటాను. "వీలు చూసుకుని తప్పకుండా వస్తాను" అన్నాను.

"వయసులో పదేళ్ళు తేడా ఉన్నా, నాకు ఎటువంటి అభ్యంతరం లేదు... మీ బాధ్యతలన్నీ తీర్చేసుకున్నారు... నాకింకా ఉన్నాయండోయ్".

"చెప్పండి."

"నాకు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న కొడుకు ఉన్నాడు.. ఒహవేళ అన్నీ సక్రమంగా జరిగి మన పెళ్ళి గనక అయితే వాడు మనతో ఉండొచ్చు కదా?"

"ఉండొచ్చు."

"మా అమ్మ చనిపోయి మూడు సంవత్సరాలు దాటాయి. నాన్న రైల్వేలో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనకు డెబ్బయి సంవత్సరాలుంటాయి. పెన్షన్ వస్తుంటుంది. మా అన్నయ్యతో ఉండడానికి ఇష్టపడడు. ఆయన కూడా మనతో..." ఆగింది.

"ఉండొచ్చు." నా కంఠస్వరం నాకే కొత్తగా వినిపించింది.

సరస్వతి పక్కన ఎవరో ఉండి ప్రాంప్టింగ్ చేస్తున్నట్టుగా ఉంది.

"నేనిక్కడ ప్రయివేటు స్కూలులో సైన్సు, అసిస్టెంటుగా పనిచేస్తున్నాను. పెళ్ళయ్యాక నేనిక్కడ, మీరక్కడ ఉండడం బావుంటుందా?"

"బావుండదు."

"అన్ని విషయాలు మీకు ముందే చెప్పడం భావ్యంగా ఉంటుంది. నేనేం దాచదల్చుకోలేదు. మా ఆయనా, నేను విడిపోయి చాలా సంవత్సరాలయింది. విడాకుల పత్రం ఇంతవరకు తీసుకోలేదు. అతను మరో ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. మాకు పుట్టిన కొడుకంటే అతనికి చాలా ఇష్టం. ఏ విధమయిన సహాయం చేయక పోయినా కొడుకును చూసుకోడానికి రెండుమూడు వారాలకొకసారయినా మా ఇంటికి వస్తుంటాడు. మన పెళ్ళి అయ్యాక రాడులెండి. పెళ్లికి ముందే విడాకుల పత్రం తీసుకుంటాను."

"......"

"మీరేం మాట్లాడడం లేదు."

"వింటున్నాను."

"ఇంకో సంగతి చెప్పడం మర్చిపోయాను. నాకో తమ్ముడున్నాడు. ఎం.బి.ఏ. పూర్తిచేసి రెండు సంవత్సరాలయింది. ఉద్యోగం లేదు. వాడు, ఉద్యోగం దొరికేంతవరకు మనతోనే ఉండొచ్చు కదా? మీకు అక్కడే బాగా పలుకుబడి ఉందని సదానందం చెప్పాడు. మీ పలుకుబడి ఉపయోగించి వాడిని ఏ చిన్న ఉద్యోగంలో నయినా పెట్టిస్తే వాడి బతుకు వాడు బతుకుతాడు. మీ మేలు నేను మర్చిపోను.. ఇప్పటికే మీకు బోరు కొట్టేసి ఉంటాను. బోరుకు పాస్ట్‌టెన్స్ బేర్ అట. భరించాలికదాండీ... మీ కోసం ఎదురు చూస్తూ ఉండేదా మరి?... మరొక్కమాట... మా తమ్ముడికి పెళ్ళి అయింది. ఒక పాప... బై.... "

అవతలి వయిపు నుండి ఫోను పెట్టేసిన చప్పుడు వినిపించాక, దీర్ఘంగా నిట్టూరుస్తూ ఫోను కట్టేశాను. రెండు రోజుల తర్వాత ఫోను చేసింది. నెంబరు చూసి తీయలేదు. లిస్టు పెరిగి ఉంటుందేమోనని భయం కూడా వేసింది. వారం తర్వాత రెండు రోజులు అనేకసార్లు ఫోన్లు చేసింది. తీయలేదు. రెండు వారాల తర్వాత సదానందం ఫోనుచేసి, "ఊళ్ళో లేవా ఏమిటన్నా?" అడిగాడు.

"ఉన్నాను. ఎక్కడికీ వెళ్ళలేదు."

"సరస్వతి చాలాసార్లు ఫోనుచేస్తే నువ్వు తియ్యనే తీయలేదట."

"కావాలనే తీయలేదు."

"సాఫ్‌సాఫ్‌గా చెప్పేసి ఉండాల్సింది. అన్నా, ఈ విషయాల్లో మొహమాటాలు ఏం పెట్టుకోకు. నేను చెబుతానులే" అన్నాడు.

అప్పుడయినా అతనితో నాకు సంబంధాలు చూడవద్దని చెప్పి ఉండవలసింది.

తర్వాత నాకు తారాబాయి ఒక సంబంధం తెచ్చింది. తారాబాయి నాకు బాగా తెలిసిన అమ్మాయి. మూడు నాలుగు రోజులకొక సారయినా ఆఫీసులో నా గదికి వచ్చి ఆప్యాయంగా, పలకరించి, పదీ, పదిహేను నిమిషాల పాటు కూర్చుని, కాఫీ తాగుతూ కబుర్లు చెప్పి వెళ్ళిపోతుంటుంది. ఎక్కడెక్కడి విషయాలో కూడగట్టి నామీద జల్లేస్తుంది. తారాబాయి తీసుకువచ్చిందే రమాదేవి సంబంధం. రమాదేవిని నేను చూడలేదు. కనీసం ఫోనులో నయినా మాట్లాడలేదు. ఆమెకు నలభయి రెండు సంవత్సరాలని, ఆదాయపు పన్ను శాఖలో పని చేస్తోందని తారాబాయి చెప్పింది.

"రమాదేవి వాళ్లు మునుపు మా ఇంటి పక్కనే ఉండేవాళ్ళు. తర్వాత సొంత ఇల్లు కట్టుకుని వెళ్ళిపోయారు. మనిషి చాలా చక్కగా ఉంటుంది. నలభయి రెండు సంవత్సరాలున్నా చూడడానికి అలా కనిపించదు. ఏ ముప్పయి రెండేళ్ళ ఆమెలా ఉంటుంది." అంది తారాబాయి.

"మనిషికి అందమేనా ముఖ్యం?" అన్నాను.

"అహ... చెబుతున్నాను. వ్యక్తి మంచిదే కాని కొద్దిగా గీర ఉంది. "

"ఇంతవరకు ఎందుకు పెళ్ళి చేసుకోలేదు."

"నచ్చినవాడు దొరకలేదట."

"నేను నచ్చకపోవచ్చు కదా?"

"నచ్చి ఉండకపోతే నన్ను మళ్ళీ మీ దగ్గరకు ఎందుకు పంపిస్తుంది?"

"మొదట్లో మీ గురించి చెప్పినప్పుడు ఆసక్తి చూపలేదు. తర్వాత తనే వచ్చి మీ గురించి వివరాలు సేకరించింది. మీకు జీతం ఎంతొస్తుంటుందని అడిగింది.

ఉజ్జాయింపుగా చెప్పేసరికి 'ఒక్కడు అంత ఏం చేసుకుంటాడు?' అంది. నవ్వేసి ఊరుకున్నాను. మళ్లీ నిన్న సాయంత్రం మా ఇంటికి వచ్చి పెళ్ళి విషయం మీతో కదపమని అడిగి నాలుగయిదు రోజలు కిందట మిమ్మల్ని చూసిందట. నచ్చినట్టు ఉందనుకుంటాను. ఒక్క షరతు పెట్టింది."

"ఏమిటది?"

"ఆమె పేరున అయిదులక్షలు బేంకులో వేయాలట."

"ఎందుకట?"

"సెక్యూరిటీ కోసమేమో, నేనడగలేదు. తనే అంది, జాయింటు ఎకౌంట్ మీద కాదట. తన పేరుమీద. "

నవ్వొచ్చింది. ఈ అతి తెలివి ఆలోచన అరకొర చదువుకున్న తారాబాయిదో ఉద్యోగంలో కొద్దోగొప్పో అనుభవం సంపాదించుకున్న రమాదేవితో అర్థంకాలేదు. ముందే చెల్లించే ఆదాయపు పన్నులా ఉంది. "ఫిక్సెడ్ డిపాజిట్టు గానా, సేవింగ్స్ ఎకౌంటులోనా?" అడిగాను.

"సేవింగ్స్ ఎకౌంట్‌లోనట. ఎకౌంటు నెంబరు, పేన్ కార్డు నెంబరు ఇచ్చింది."

తారాబాయి, రమాదేవి అమాయకుల్లా నాకు అనిపించడం లేదు. మా కంపెనీలో సంవత్సరానికి ఒకసారి చేసే భద్రతా వారోత్సవాలు గుర్తు వచ్చాయి.

"నామీద నమ్మకం లేకనా?" అడిగాను.

"ఏమో".

"నేనామె ఎకౌంట్‌లో వేసిన డబ్బు వెంటనే తను తీసేసుకుంటేనో?"

"ఒకసారి ఆమె పేరన ఉంది ఆమెదే అవుతుంది కదా?"

సంభాషణ నాకు విసుగెత్తుతోంది. తారాబాయి అమాయకత్వంతో అంటోందా లేక నన్ను అమాయకుడిగా పరిగణిస్తోందో తెలియడం లేదు.

"చూడు తారా, ఆ రమాదేవి ఎవరో నాకు తెలియిదు. ఆమెను నేనెప్పుడూ చూడలేదు. ఆమె గురించి కొద్దిగానయినా తెలియదు. ఆమె నీ స్నేహితురాలు కావచ్చు. అందగత్తె కావచ్చు. అంచాత ఆమె అడిగీ అడగ్గానే అంత డబ్బు ఎలా ఇస్తానని, ఆమె సంగతి వదిలెయ్. నువ్వెలా అనుకుంటున్నావు?" అడిగాను.

తారాబాయి జవాబు చెప్పలేదు.

పదిరోజుల తర్వాత తారాబాయి రమాదేవి ప్రస్తావన తీసుకురాగానే, "ఆమె గురించి నువ్వు తప్పకుండా మాట్లాడాలా?" అడిగాను.

"వద్దా?" అడిగింది.

తల అడ్డంగా ఆడించాను.

ఏదో పెళ్ళి విందులో నాగమణిని ఎవరో నాకు పరిచయం చేశారు. ఆమెకు నా వయసు ఉంటుంది. బావుంది. మంచి మాటకారి. "ఈ మధ్యే సదానందం మీ గురించి చెప్పాడు. నేను అగ్రికల్చరల్ డిపార్టుమెంటులో పని చేస్తున్నాను. ఒకతే కూతురు. దానికి పోయిన సంవత్సరమే పెళ్ళి చేశాను. నాకు ఏ బాదరబందీ, మీకు మల్లె బరువు బాధ్యతలు ఏమీ లేవు. మీరు కనీసం మూడు నెలల కిందటయినా పరిచయం అయి ఉంటే ఎంత బావుండేది? సదానందం చేసే పనులన్నీ ఇలానే ఉంటాయి. అవసరమయిన వాళ్ళను కానిచోట ముడి పెట్టేస్తుంటాడు. నాకు రెండో సంబంధం తెచ్చింది అతనే. నా ఖర్మకొద్దీ మూడునెలల కిందట పెళ్ళి అయింది. నాకు దొరికినవాడు పరమ దరిద్రుడు. నన్ను చంపుకు తింటున్నాడు. ఒక్క కాణీ బయటకు తీయకుండా నా డబ్బులకే అణా పయిసలుతో లెక్క అడుగుతుంటాడు. పయిపెచ్చు నేనెవరితో మాట్లాడినా అనుమానం. ఏ మూలో, నక్కి మనల్ని చూస్తూ ఉండొచ్చు... వీడెప్పుడు చస్తాడో ఏమో" అంటోంటే ఎవరో ఆమెను పిలిచారు. వెళ్ళిపోయింది. మళ్ళీ కనపడలేదు.

రెండు వారాల తర్వాత వరలక్ష్మి నుండి ఫోను వచ్చింది. తన పేరు చెప్పి, "మీ నెంబరు సదానందం గారిచ్చారు. మీతో మాట్లాడవచ్చా?" అడిగింది.

"మాట్లాడండి." అన్నాను.

"మీరు ఫ్రీగానే ఉన్నారు కదూ?"

"ఫ్రీగానే ఉన్నాను. చెప్పండి."

"నా వయసు నలభయి ఏడు సంవత్సరాలు. నిజం చెబుతున్నాను. వయసు తక్కువ చేసేం చెప్పడం లేదు. ఇ.యం.ఇ. లో సివిలియన్ గా పనిచేస్తున్నాను."

"ఎక్కడ?"

"సికిందరాబాద్‌లో. ఉండేది చందానగర్‌లో.. మా అన్నయ్య వాళ్ళింట్లో... ఒక్క గంటలో మిమ్మల్ని కలవడానికి వీలుంటుందా?"

"అంత అవసరమా?"

"అనిపిస్తోంది."

"ఇప్పుడు ఆఫీసులో ఉన్నాను."

"సాయంత్రం అయిదు తర్వాత వీలుంటుందా? మీరు కారులోనే కూకట్‌పల్లి జె.ఎన్.టి.యు మీదుగా వెళ్తారు కదా, నేను జె.ఎన్.టి.యు ఎదురుగా ఉన్న

బస్‌స్టాప్‌లో నుంచుని ఉంటాను. మీరు నన్ను పికప్ చేసుకున్నాక  నా గురించి వివరంగా కార్లో కూర్చుని చెబుతాను."

"మిమ్మల్నెలా గుర్తుపట్టడం?"

"లేత పసుపురంగు చీర కట్టుకుని ఉంటాను. అడగకూడదు. కాని అడగకుండా ఉండలేకపోతున్నాను..."

"అడగండి."

"ఏం లేదు.... మీరు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారా?"

"లేదు."

"మీకు మూడో నాలుగో ఇళ్ళు ఉన్నాయని సదానందం గారు చెప్పారు. ఆస్థి పంపకాలు జరిగాయా?"

"ఇంకా జరగలేదు."

"చనువుగా సలహా ఇస్తే ఏమనుకోరు కదా?"

"అనుకోను."

"పంపకాలు నాలుగు భాగాలుగా చేయాల్సి వస్తుంది. మీ పిల్లలకు చెరొక భాగం, మీకో భాగం . మీరు చేసుకోబోయే వ్యక్తికి నాలుగో భాగం.. అన్నీ అనుకూలిస్తే .. వెల్. ఆ వ్యక్తి నేను కావచ్చు కదా? మీరు వచ్చేటప్పుడు నాకో చిన్న సహాయం చేసిపెడతారూ?"

"చెప్పండి."

"పరిచయం అయ్యీ, అవ్వక ముందే ఇలా అడగడం నాకూ ఇబ్బందిగా అనిపిస్తోంది. దయచేసి నన్ను మరోలా అనుకోకండి. నాకు అత్యవసరంగా పాతికవేలు కావాలి."

"చేతిలో అంత డబ్బు ఉంచుకోను."

"మీకు ఎ.టి.ఎం. కార్డు ఉండి ఉండాలి. అందులోంచి తీసి ఇవ్వగలరా? అప్పుగా ఇవ్వండి. ముందు తేదీలు వేసి చెక్కులు ఇమ్మంటే ఇస్తారు. నా సెల్‌లో ఎక్కువ నిమిషాలు లేవు. మీ కారు ఏ రంగులో ఉంటుంది? నెంబరెంత?"

చెప్పాను.

"ఖచ్చితంగా నేను అయిదుంబావుకు అక్కడకు వచ్చి ఉంటాను. పావుగంట ఆలస్యమయినా  ఏమనుకోవద్దు. బస్సులో రావాలి నేను... " అంది.

అయిదున్నరకు బస్‌స్టాప్ దగ్గరకు వచ్చి, పక్కగా కారాపి ఇరవయి నిమిషాలకు పయిగా ఎదురు చూశాను. ఆమె రాలేదు. ఫోను చేయలేదు. మరుసటి రోజు కాని, ఆ తర్వాత కాని ఆమె నుండి ఫోను రాలేదు.

వరలక్ష్మి తర్వాత మరో ముగ్గురు ఫోన్లు చేశారు. నామీద నాకే విసుగు ప్రారంభమయింది. నేను చేస్తోన్న పని నాకే బావుండడం లేదు. ఈ వయసులో నన్ను చేసుకోడానికి ముందుకు వచ్చే స్త్రీ కోరుకొనేది భద్రత. అది తప్పుకాదు. అయితే నన్ను నేను మభ్యపెట్టుకుంటూ ఇతరులను మభ్య పెట్టడం నా మటుకు నాకే ఎబ్బెట్టుగా అనిపించింది. ఈ సంగతి గ్రహించే లోపల నా నీడ చాలా దూరం వెళ్ళిపోయింది.

తప్పు సదానందానిది కాదు. నాది. నా బాధ్యత చాలా ఉంది.

చివరిగా సదానందం నెల్లూరు నుండి ఫోను చేశాడు. "అన్నా, నీకు భారతిని పరిచయం చేస్తున్నాను.. నీకు ఎంతో అనుకూలమయిన వ్యక్తి అనిపిస్తోంది. ఈ మధ్య నువ్వు ఎవరి పెళ్ళికో నెల్లూరు వచ్చినప్పుడు నిన్ను చూసిందట. ఇక్కడ ఆమెకు సొంతిల్లు ఉంది. భర్త ఎయిర్ ఫోర్సులో పనిచేస్తూ చనిపోయి అయిదేళ్ళు అయింది. ఆమెకు నలభయి అయిదు సంవత్సరాలుంటాయి. చామనచాయ. పిల్లలు లేరు... ఇదో ఆమెకు ఫోనిస్తున్నాను. మాట్లాడు..."

"నమస్కారమండీ" అంది భారతి.

"నమస్కారమండీ" అన్నాను.

"సదానందంగారు ఇవేళ చెప్పకముసుపే మీరు నాకు తెలుసండీ."

ఆమెతో ఏం మాట్లాడాలో తెలియడం లేదు. నాకు ఏ సంబంధం చూడొద్దని సదానందానికి చెప్పినా వినడం లేదు.

"నాకు పెన్షన్ వస్తోంది" అంది.

ఎంతని అడగలేదు. తనే చెప్పింది.

"మీ అయనెలా చనిపోయారు?" అడిగాను.

"గుండె జబ్బు వలన. సర్జరీ చేశారు. లాభం లేకపోయింది."

"సారీ మిమ్మల్నని కాదు,. మీది ఫేమిలీ పెన్షన్ అనుకుంటాను. మీరు ఎవరిని పెళ్ళి చేసుకున్నా పెన్షన్ ఆగిపోతుంది. నాది పెన్షన్ వచ్చే ఉద్యోగం కాదు. నా గురించి నిజం చెబుతున్నాను. వినండి. ఇప్పుడు నేను ఆస్పత్రి గదిలో మంచం మీద కూర్చుని మీతో మాట్లాడుతున్నాను. రేపు నాకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయబోతున్నారు. బతికి బయట పడతానో, లేదో తెలియదు. నా వలన మీరు మరోసారి విధవరాలు కాకూడదు..." అంటున్నాను. మాట ముగించలేదు. భారతి వెక్కి వెక్కి ఏడవడం వినిపిస్తోంది.

* ఆదివారం వార్త, 27 డిసెంబరు 2009.